క్లుప్తంగా

రెండు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్



రామచంద్రపాలెంలో పారిశుధ్య డ్రైవ్‌లో పాల్గొన్న ఎంపీడీవో చంద్రశేఖర్, సిబ్బంది

కోటవురట్ల: మండలంలోని బి.కె.పల్లి, రామచంద్రపాలెం గ్రామాల్లో గురువారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అధికారులు, పారిశుధ్య కార్మికులు ఇంటింటికి వెళ్లి పారిశుధ్యంపై అవగాహన కల్పించి చెత్తను సేకరించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. పేరుకుపోయిన చెత్త వివరాలు నమోదు చేశారు. మంచినీటి నమూనా సేకరించి ల్యాబ్‌కు పంపించారు. రక్షిత మంచినీటి పథకాలలో క్లోరినేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ వర్షాలు పడుతున్నందున ప్రతి ఒక్కరూ పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కాచి వడకట్టిన నీటినే తాగాలని, జ్వరాలు వస్తే వెంటనే ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవడంతో పాటు అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రఘురాం, సిబ్బంది పాల్గొన్నారు.

గంగాలమ్మతల్లి గుడికి విరాళం



గంగాలమ్మ తల్లి గుడికి విరాళం అందజేస్తున్న భక్తులు

మునగపాక: మండలంలోని పాటిపల్లి–మంగళవరపుపేట పరిధిలోని గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పలువురు భక్తులు ఆలయ నిర్మాణంలో భాగస్వాములవుతున్నారు. విశాఖపట్నం అల్లిపురానికి చెందిన యల్లపు ఆదినారాయణ, అచ్చియమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు రమణ, శంకరరావు, రాజు గురువారం రూ.30,116 నగదును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రామావతారంలో జగన్నాథుడు



జగన్నాథ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: మునగపాక, నాగులాపల్లి గ్రామాల్లో గురువారం సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథ స్వామి రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి ఆయా గ్రామాల్లోని జగన్నాథున్ని భక్తులు దర్శించుకొని పూజలు చేశారు. ఈ నెల 6వ తేదీన జగన్నాథస్వామి పండగను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు రమణకు పరామర్శ



రమణను పరామర్శిస్తున్న చిక్కాల రామారావు

పాయకరావుపేట: పెంటకోట గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకుడు చేపల రమణను ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామరావు గురువారం పరామర్శించారు. రమణ తండ్రి గుర్రయ్య ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకుని వారి కుటుంబ సభ్యులను చిక్కాల ఓదార్చారు. సర్పంచ్ చేపల నాగమణి తాతాజీ, సీనియర్ నాయకుడు దొంగ దేవుడు, వార్డు సభ్యులు బొంది జోగిరాజు, సూదుల గోపి, కొవిరి బాలమ్మ బాబ్జి, దొంగ అమ్మాజీ, శ్రీను పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్లకు నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కోటవురట్ల: కైలాసపట్నం 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న రాజుపేట ఫీడర్‌లోని వ్యవసాయ మోటార్లకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీ ట్రాన్స్‌కో డివిజనల్ ఇంజినీరు ఎ.వి.ఎస్.ఎం.అప్పారావు ఓ ప్రకటనలో తెలిపారు. రాజుపేట, టి.జగ్గంపేట గ్రామాలకు సంబంధించి విద్యుత్ లైన్ల కింద చెట్ల నరికివేత కారణంగా వ్యవసాయ మోటార్లకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని పేర్కొన్నారు. రైతులు సహకరించాలని కోరారు.



కొబ్బరితోటలో దట్టంగా పెరిగిన వయ్యారిభామ మొక్కలు



కోటవురట్ల మండల పరిషత్ కార్యాలయంలో ఏపుగా పెరిగిన వయ్యారిభామ కలుపు మొక్కలు

కలవరపెడుతున్న వయ్యారిభామ!

కోటవురట్ల: ప్రస్తుతం ఖరీఫ్ పనులు ప్రారంభమవుతున్న వేళ అన్నదాతను వయ్యారిభామ కలవరపాటుకు గురిచేస్తోంది. ఇబ్బడిముబ్బడిగా పెరిగిన వయ్యారిభామను నిర్మూలించే మార్గం కనిపించక రైతులు ఆందోళన చెందుతున్నారు. మనుషులకే కాకుండా జంతువులకు తీవ్ర నష్టాన్ని కలిగించే ఈ కలుపు మొక్క ప్రస్తుతం ఓ పెద్ద సమస్యగా మారింది.

ఎందెందు చూసినా నేనే..

వయ్యారిభామ కలుపు మొక్కలు పొలాల్లోనే కాకుండా జనావాసాలలో కూడా ఇబ్బడిముబ్బడి **పెరిగి ఆందోళన కలిగిస్తున్నాయి. మండల పరిషత్, తహసీల్దారు, సబ్ రిజిస్ట్రార్ ఇలా ప్రభుత్వ కార్యాలయాలలోనే కాకుండా ఎక్కడ** చూసినా ఇళ్ల మధ్య ఏపుగా పెరిగిన వయ్యారిభామ కలుపుమొక్కలు అనారోగ్య సమస్యలను సృష్టిస్తున్నాయి. ఖరీఫ్ సాగు చేసేందుకు సిద్ధమవుతున్న రైతులకు వయ్యారిభామ కలుపుమొక్కల నివారణ పెద్ద సవాల్‌గా మారింది.

పంటలపై తీవ్ర ప్రభావం

వయ్యారిభామ కలుపుమొక్క ఎక్కడ ఉంటే అక్కడ ఏ పంట వేసినా దాని ఎదుగుదలను **అడ్డుకుంటుంది. పంటలకు వేసిన ఎరువులు, రసాయనాలను సైతం లాక్కుని పంటల దిగుబడిని దాదాపు 40 శాతం వరకు తగ్గిస్తుంది.**

పుప్పొడితో ప్రమాదం

ఈ కలుపుమొక్క పుప్పొడి ద్వారా వెలువడే గాలులను పీలిస్తే మనుషులకు శ్వాసకోశ వ్యాధులు వస్తాయి. గడ్డితో పాటు ఈ మొక్కలను తిన్న పశువులకు గర్భకోశ వ్యాధులు, కిడ్నీ, లివర్, శ్వాసక్రియ దెబ్బతింటాయి. ఈ మొక్కలను తిన్న పశువుల పాలు తాగితే జ్ఞాపకశక్తి మందగిస్తుంది. వీటి పుప్పొడి గాల్లో 3 కిలోమీటర్ల వరకు ప్రయాణించి అక్కడ వ్యాపించి మొలకెత్తుతాయి. ఆకులు, పుప్పొడిని తాకినా చర్మ వ్యాధులు చుట్టుముడతాయి. సాధ్యమైనంత వరకు పిల్లలు ఈ మొక్కల దగ్గరకు వెళ్లకుండా చూసుకోవాలి. సామూహిక నిర్మూలన ద్వారా ఈ కలుపు మొక్కను నాశనం చేయడం ద్వారా కొంత వరకు నష్టాన్ని నివారించవచ్చని వ్యవసాయ శాఖ నిపుణులు సూచిస్తున్నారు.

అనుకోని అతిథిలా.!

వయ్యారిభామ కలుపు మొక్క శాస్త్రీయ నామం పార్థీనియం హిస్టెరోఫోరస్ కాగా 1956లో అమెరికా నుంచి గోధుమల దిగుమతి ద్వారా మన దేశానికి అనుకోని అతిథిలా వచ్చి ఇక్కడే తిష్టవేసింది. కాలక్రమేణా అంతుచిక్కని సమస్యగా మారి రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది.

ఆందోళన కలిగిస్తోంది..



వయ్యారిభామ కలుపుమొక్కలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. పంట పొలాల్లోనే కాకుండా ఇళ్ల మధ్యలో కూడా ఏపుగా పెరిగాయి. వీటిని నివారించడం చాలా కష్టంగా ఉంది. ప్రస్తుతం ఖరీఫ్ వరి పనులు ప్రారంభమవుతున్నాయి. కానీ వయ్యారిభామ కలుపు మొక్కలు పెద్ద సమస్యగా మారాయి. వీటి నివారణకు ఖర్చు ఎక్కువవుతోంది.

– పైల శివరామ్, సర్పంచ్, చినబొడ్డేపల్లి

ఉపాధి హామీ పథకం ద్వారా నివారించాలి



రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించడమే కాకుండా ఎంతో ప్రమాదకరంగా ఉన్న వయ్యారిభామ కలుపుమొక్కలను ఉపాధి హామీ పథకం ద్వారా నివారించాలి. ఏటా దీని వల్ల సాగు ఖర్చు కూడా పెరుగుతోంది. ప్రజల ఆరోగ్యాన్ని కూడా చెడగొడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం దీనిని పెద్ద సమస్యగా గుర్తించి శాశ్వత నివారణకు చర్యలు తీసుకోవాలి.

– శానాపతి రామునాయుడు, రైతు, చౌడువాడ

నివారణకు చర్యలు తీసుకోండి

వయ్యారిభామ కలుపుమొక్కలను అశ్రద్ధ చేస్తే రైతులకు తీవ్ర నష్టమే. పంట పొలాల్లో కనిపిస్తే పూత రాకముందే వేళ్లతో సహా పీకివేసి బురదలో తొక్కేయాలి. లేదా తగలబెట్టేయాలి. ఇవి ఎక్కువగా కనిపిస్తే గట్లపై తంగేడు మొక్కలను పెంచాలి. పూత రాకముందే 10 లీటర్ల నీటిలో 5 కిలోల ఉప్పు ద్రావణాన్ని కలిపి పిచికారీ చేయాలి. ఇలా చేయడం వల్ల మొక్కలు వ్యాప్తి చెందకుండా ఉంటాయి.

– బి.సరోజిని, మండల వ్యవసాయాధికారి, కోటవురట్ల

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



మాట్లాడుతున్న తోటాడ సర్పంచ్ మంగవేణి

మునగపాక: తోటాడ పంచాయతీలో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పాలకవర్గం కృషి చేస్తుందని సర్పంచ్ దొడ్డి మంగవేణి అన్నారు. తోటాడ సచివాలయంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి పాలకవర్గం పాటుపడుతుందన్నారు. పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సదుపాయం, తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. ఎంపీటీసీ కాండ్రేగుల వెంకట లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి, పెద్దలు దొడ్డి కోటేశ్వరరావు, బుద్ద రమేష్, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

అలరించిన సంకీర్తనలు, కోలాటం



జగన్నాథ స్వామి ఆలయ ప్రాంగణంలో సంకీర్తనలు ఆలపిస్తున్న గాయకులు

మునగపాక: మునగపాక జగన్నాథస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన అన్నమయ్య సంకీర్తనలు, కోలాటం ప్రదర్శనలు అందరినీ అలరించాయి. జగన్నాథుని ఉత్సవాల్లో భాగంగా బైపాస్ రోడ్డులోని ఆలయం ఆవరణలో మునగపాకకు చెందిన అన్నమయ్య స్వర తరంగిణి కళాకారులతో ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనలను తిలకించేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

చంటి అప్పారావుకు ఘన నివాళి



చంటి అప్పారావు జ్ఞాపకార్థం మొక్కల పంపిణీలో పాల్గొన్న జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, నాయకులు

కోటవురట్ల: జెడ్పీటీసీ సిద్ధాబత్తుల ఉమాదేవి మామయ్య, వైఎస్సార్ సీపీ నాయకుడు సత్యనారాయణ తండ్రి దివంగత చంటి అప్పారావుకు పలువురు ప్రజా ప్రతినిధులు గురువారం ఘన నివాళి అర్పించారు. చంటి అప్పారావు పెద్ద కర్మ కార్యక్రమాన్ని కైలాసపట్నంలోని ఆయన నివాసంలో గురువారం నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మాజీ ఎమ్మెల్యే, పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు, మాజీ ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంట్ పరిశీలకుడు డి.వి.సూర్యనారాయణరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్ఎస్ సీతారామరాజు, జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ చిక్కాల రామారావు.. అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన జ్ఞాపకార్థం రైతులకు కొబ్బరి మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీసెల్ మాజీ చైర్మన్ పైల రమేష్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, పార్టీ నాయకుడు శ్రీపతిరాజు, జెడ్పీటీసీలు పి.ఎస్.రాజు, సుర్ల గిరిబాబు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఔదార్యం



రైన్ డ్రెస్సులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కోటవురట్ల: పేద విద్యార్థులకు తమ వంతు సాయంగా రైన్ కోట్లు అందించి సేవకు మేము సైతం అంటున్నారు పలువురు గురువులు. కొడవటిపూడి శివారు గ్రామాలైన కోదండరాంపురం, చినరాచపల్లికి చెందిన 20 మంది విద్యార్థులు కొడవటిపూడి జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్నారు. గత పది రోజులుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ముమ్ముందు కూడా వర్షాలు పడే అవకాశం ఉంది. విద్యార్థులు రోజూ వర్షంలో తడుస్తూ రావడాన్ని గుర్తించిన ఉపాధ్యాయులు తమ వంతు సాయం చేయాలని భావించారు. హెచ్ఎం ఆర్.ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులంతా కలిసి తమ సొంత నిధులు సేకరించి 20 రైన్ డ్రెస్సులు కొనుగోలు చేశారు. వీటిని స్కూల్ కమిటీ చైర్మన్ యలమంచిలి శ్రీను చేతుల మీదుగా విద్యార్థులకు గురువారం అందజేశారు. హెచ్ఎం ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి దాతలు సహకారం అందించాలని కోరారు. మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు ముందుకు రావాలన్నారు.

డీపట్టా రైతులకూ పథకాలు ఇవ్వాలి



రైతులతో మాట్లాడుతూ సీపీఎం నాయకులు

ఎస్.రాయవరం: పెదగుమ్ములూరు గ్రామంలో డీపట్టా భూములు ఉన్న రైతుల వివరాలు ఆన్‌లైన్ నమోదు చేసి ప్రభుత్వ పథకాలకు అర్హులను చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. పెదగుమ్ములూరులో సర్వే నెంబర్లు 513, 515, 521లో సుమారు 20 ఎకరాలు, 23 మంది నిరుపేద రైతులకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2005లో పట్టాలు ఇచ్చారన్నారు. అప్పటి నుంచి సాగులో ఉన్న రైతులతో గురువారం సీపీఎం నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల వివరాలు ఆన్‌లైన్ చేయకుండా రెవెన్యూ అధికారులు తాత్సారం చేస్తున్నారన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలు కోల్పోవడమే కాకుండా, బ్యాంకు రుణాలు పొందేందుకు 1బీ, అడంగళ్ ఆన్‌లైన్‌లో రావడం లేదని పేర్కొన్నారు. భూములు అభివృద్ధి చేసుకునేందుకు నిరుపేద రైతులకు రెవెన్యూ అధికారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ సభ్యుడు ఎం.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీటిలోనే డెంగ్యూ దోమల ఉత్పత్తి



డెంగ్యూ, మలేరియా జ్వరాల పట్ల అవగాహన కల్పిస్తున్న ఎంఈవో–2 రజిని

అచ్యుతాపురం రూరల్ : డెంగ్యూ దోమలు సంతానోత్పత్తికి స్వచ్ఛమైన వర్షపు నీటి నిల్వలే కారణమని పీహెచ్‌సీ వైద్యాధికారి కె.శ్రావ్య అన్నారు. జాతీయ డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా గురువారం ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో డెంగ్యూ, మలేరియా జ్వరాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంఈవో–2 రజిని మాట్లాడుతూ ఇంట్లో ఫ్రిజ్ వెనక భాగం, తాగి పారేసిన కొబ్బరి బొండాలు, డ్రమ్ముల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్ఎస్ ప్రిన్సిపాల్ పి.మధు, ఆరోగ్య పర్యవేక్షకుడు పి.సన్యాసిరావు, ఆరోగ్య సహాయకుడు లండా అప్పలకొండ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



మంచినీటి బోరు మరమ్మతు పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ నూకరాజు

మునగపాక: వాడ్రాపల్లిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు తెలిపారు. గ్రామంలో మరమ్మతులకు గురైన మంచినీటి బోర్లను ఆయన గురువారం అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాడ్రాపల్లి పంచాయతీ పరిధిలో ఎక్కడైనా తాగునీటి సమస్య వస్తే తన దృష్టికి తీసుకురావాలన్నారు. బోర్లు మరమ్మతులకు గురైనా వాటిని అందుబాటులోకి తీసుకువచ్చేలా కృషి చేస్తామన్నారు.

అల్లూరి జయంతి ఏర్పాట్లు పరిశీలన



అల్లూరి పార్కులో ఏర్పాట్లు పశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

గొలుగొండ : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 128 జయంతి వేడుకలు ఏర్పాట్లను నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. పార్కులో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం అల్లూరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం కోసం ఏర్పాట్లు చేయడం జరిగింది. దీని కోసం పార్కును అందంగా తీర్చిదిద్దారు. అల్లూరి ఉత్సవ కమిటీ, టూరిజం శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్ఐ తారకేశ్వర్రావుకు డీఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.

బాలసదనంలో హెల్త్ స్క్రీనింగ్ క్యాంప్



స్క్రీనింగ్ నిర్వహించిన బాలసదనం విద్యార్థులతో బాలల సత్వర చికిత్స కేంద్రం వైద్యులు, వైద్య సిబ్బంది

నర్సీపట్నం: మిషన్ వాత్సల్యం పథకంలో భాగంగా జిల్లా సత్వర చికిత్స కేంద్రం వారు నర్సీపట్నం బీసీ కాలనీలోని బాలసదనంలో పిల్లలకు హెల్త్ స్క్రీనింగ్ క్యాంప్ శుక్రవారం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎం.హైమావతి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.ఎస్తేర్రాణి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యులు క్యాంప్‌లో పాల్గొని పుట్టుకతో వచ్చే శారీరక, మానసిక లోపాలు, జనన లోపాలు, పోషకాహార లోపాలు, వ్యాధులపై విద్యార్థులు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. జిల్లా సత్వర చికిత్స కేంద్రానికి తరలించి పిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్తేర్రాణి తెలిపారు.

అందుబాటులోకి వరి విత్తనాలు



రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్న వరి విత్తనాలు

పాయకరావుపేట: మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులకు వరి విత్తనాలు సరఫరా చేస్తామని మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ తెలిపారు. మండలంలో 2300 హెక్టార్లలో 12 వేల మంది రైతులు వరి పంటను వేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. 913 క్వింటాళ్ల వరి విత్తనాల కోసం ప్రభుత్వానికి ఇండెంట్ పెట్టామని, 722 క్వింటాళ్ల వరి విత్తనాలు మండలానికి వచ్చినట్టు ఏవో తెలిపారు. వీటిలో ఇప్పటికే ఆర్‌జేయల్ వరి విత్తనాలు 711 క్వింటాళ్లు, బీపీటీ వరి విత్తనాలు 11 క్వింటాళ్లు, పచ్చి రొట్ట విత్తనాలు 55 క్వింటాళ్లు రైతులకు అందజేస్తామన్నారు. 30 కేజీల బస్తా ఆర్‌జేఎల్ విత్తనాలు రూ.990, బీపీటీ రూ.825కు రాయితీపై రైతులకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతులు విత్తనాల కోసం సంప్రదించాలని ఆయన కోరారు.

దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



సమ్మె పోస్టర్ విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

యలమంచిలి రూరల్: నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ ఈ నెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం యలమంచిలి కనకమహాలక్ష్మి రిక్షా స్టాండు వద్ద సీఐటీయూ నాయకులు సమ్మె పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ యలమంచిలి మండల కార్యదర్శి చింతకాయల శివాజీ మాట్లాడుతూ కార్మికుల హక్కులు కాలరాసే కొత్త కార్మిక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త కార్మిక చట్టాలు దేశంలో కార్పొరేట్లు, యాజమాన్యాలకు ప్రయోజనం చేకూర్చేందుకేనని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు చందక రామకృష్ణ, రిక్షా కార్మికులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్ : రవాణ రంగ కార్మికులు ఈ నెల 9న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని గురువారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము, మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు కోరారు. పెరుగుతున్న డీజిల్, బీమా, చలానా చార్జీల ధరలకు నిరసనగా ఆటో, లారీ, బస్సు కార్మికులు సమ్మెలో పాల్గొని రవాణ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే విధానాన్ని వ్యతిరేకించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు కర్రి నాయుడు, ఉపాధ్యక్షుడు తట్టా రాజు, రామకృష్ణ, వరబాబు, చండి, అప్పలకొండ, శ్యామ్, చిట్టి అప్పారావు, ఆనంద్, గోవిందరావు పాల్గొన్నారు.



అచ్యుతాపురంలో ప్రచారం చేస్తున్న సీఐటీయూ నాయకులు